సాక్షి జగిత్యాల
ఆదివారం । 29 । జనవరి । 2023



sunday special

నృత్యం చేస్తున్న కళాకారులు

న్యూస్‌రీల్

'పోక్సో' గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వీరయ్య

జగిత్యాల: పోక్సో చట్టం గురించి అందరూ తెలుసుకోవాలని జిల్లా జడ్జి వీరయ్య సూచించారు. స్థానిక సఖీ కేంద్రంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, సమాజంలో జరిగే హింసలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ శనివారం కోర్టులోని డీఎల్ఎస్ఏ న్యాయ సహాయ కేంద్రంలో సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సఖీ సేవలు బాగున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్జిలు ప్రసాద్, జితేందర్, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, సఖీ నిర్వాహకులు మనీల, లావణ్య, శ్రీవాణి పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ సింధూశర్మ

జగిత్యాలక్రైం: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయమని ఎస్పీ భాస్కర్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీ సింధూశర్మ నుంచి ఎస్పీ భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, సామాన్యులకు పోలీసు సేవలు అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. మహిళ రక్షణ కోసం ప్రాధాన్యం ఇస్తామన్నారు. విద్వేశాలు రెచ్చగొట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, సీఐలు కిశోర్, కృష్ణకుమార్, రమణమూర్తి, లక్ష్మీనారాయణ, కోటేశ్వర్ పుష్పగుచ్ఛం అందించారు.

సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా

రాయికల్(జగిత్యాల): ఇటిక్యాల రైతులు వ్యవసాయ రంగ విద్యుత్ సమయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. సమయపాలన లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అన్నదాతలతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

కన్నుల పండువగా సూర్యభగవానుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో సూర్యభగవానుని కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చింతకుంట చెరువు సమీపంలో ధన్వంతరి దేవాలయంలో సుమారు 500 మంది మహిళలతో కల్యాణం నిర్వహించారు. రథ సప్తమి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. లోక కల్యాణార్థం ఈ బృహత్ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు వెల్లడించారు. వేద పండితులు నాగరాజు, శరత్‌బాబు, విష్ణు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణ

కోరుట్ల: పట్టణానికి చెందిన జ్యోతిష్య నిపుణుడు జక్కుల రామకృష్ణకు డాక్టరేట్ లభించింది. తమిళనాడు హోసూర్ ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యునివర్సిటీవారు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. అడిషనల్ జడ్జి జె.హరిదాస్, నేషనల్ ఆయుర్వేదిక్ డైరెక్టర్ ఢిల్లీ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందజేశారు. రామకృష్ణను పలువురు అభినందించారు.

నృసింహుని సన్నిధిలో పూజలు

ధర్మపురి: కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు దంపతులు శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాల్లోనూ ప్రత్యేకపూజలు చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వర నీరాజనం.. నృత్య మనోహరం

నిత్యం 200 మందితో..



కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు ఆధ్యాత్మికతను పంచే విధంగా కళావేదికపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం 200 వందలమంది కళాకారులతో ఉదయం పదిగంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పారాయణం, కచేరీ, భజనలు, సంకీర్తనలు, జానపద నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం, సంగీత విభావరి,భక్తి నాటకాలు ప్రదర్శిస్తున్నారు. 10 రోజులు పాటు జరిగే కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లానే కాకుండా తెలంగాణ నలువైపుల నుంచి మూడువేలకు పైగా కళాకారులు తరలివచ్చి స్వామివారికి నీరాజనం పలుకుతున్నారు. శనివారం వరకు సుమారు రెండువేల మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చినట్లు బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి గోగుల ప్రసాద్ వివరించారు.

- శ్రీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో కళాకారుల వైభవం
- కరీం'నగరం'లో నిత్య కీర్తనలు.. సాంస్కృతిక నృత్యాలు
- రాష్ట్ర నలుమూల నుంచి వేలమంది కళాకారుల రాక
- పదిరోజుల పాటు వివిధ ప్రత్యేక కార్యక్రమాలు
- వేదికపై మూడువేల మందితో నిత్య గీతారాధన

కరీం'నగరం' గోవింద నామస్మరణతో మార్మోగుతోంది. వెంకన్నసేవలో తరిస్తోంది. నగరంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మి- పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 2వ తేదీ గురువారం శోభాయాత్రతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ వేడుకలు ఓవైపు ఆధ్యాత్మికను పంచుతుండగా.. మరోవైపు వెంకన్నకు స్వరనీరాజనం పలుకుతున్నారు పలువురు కళాకారులు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తూ... సంకీర్తనలు, వివిధ సాంస్కృతిక నృత్యాలతో కళావేదికపై మనోహరాన్ని పంచుతున్నారు. వెంకన్న బ్రహ్మోత్సవాల్లో కళావైభవం.. పలు కళారంగాలకు చెందిన వారిపై సండే స్పెషల్..

- సాక్షి, కరీంనగర్ డెస్క్



అనర్గళంగా చాలీసా పారాయణం



కరీంనగర్ పట్టణంలోని పాతబజార్ ప్రాంతానికి చెందిన హనుమాన్ సేవా సమితి సభ్యులు చాలీసా పారాయణంలో ఆకట్టుకుంటున్నారు. ఈ సేవా సమితి ప్రస్తుతం 500కు పైగా సభ్యులతో కొనసాగుతోంది. ప్రతీ కార్యక్రమంలో 50మందితో చాలీసా పారాయణం చేస్తున్నారు. కొండగట్టులో జయంతి ఉత్సవాల సందర్భంగా 2022లో 41 రోజుల చాలీసా పారాయణం చేశారు. 2021లో కొండగట్టులో 18రోజుల పాటు, 2019లో నగునూరు దుర్గాభవాని ఆలయంలో చాలీసా పారాయణం చేశారు. నగరంలోని వెంకన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన చాలీసా పారాయణం ఆకట్టుకుంది. 500మంది సభ్యులతో హనుమాన్ చాలీసా పారాయణం చేసే హనుమాన్ సేవా సమితికి గతంలో వరల్డ్ రికార్డులో సైతం చోటు దక్కింది.

ఆనందంగా ఉంటుంది



మేమంతా కలిసి వివిధ ఆలయాల్లో భజన కార్యక్రమానికి వెళ్తుంటాం.. ప్రతీ ఆలయంలో తక్కువలో తక్కువగా గంటకుపైగానే కార్యక్రమాలు నిర్వహిస్తాం.. మా బృందంలో వృద్ధుల నుంచి యువకుల వరకు ఉన్నారు. దేవుళ్ల పాటలు పాడుతుంటే మనసులో తెలియని ఆనందం ఉంటుంది.

- రాజ్‌కుమార్, శివరామకృష్ణ భజన మండలి, గట్టుదుద్దెనపల్లి

సంకీర్తనల 'రేవతి'



కరీంనగర్ పరిధిలోని తీగలగుట్టపల్లి ప్రాంతానికి చెందిన బొజ్జ రేవతి గృహిణి. సంగీతంలో డిప్లొమా చేశారు. 20 సంవత్సరాల నుంచి భక్తి కీర్తనలు పాడుతున్నారు. ధర్మపురి, వేములవాడ, యాదగిరిగుట్ట ఆలయాల్లో రెగ్యులర్‌గా ప్రదర్శనలు ఇస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఐదుసార్లు, ఒకసారి నాదనీరాజనంలో ప్రదర్శన ఇచ్చారు. 2020 జనవరి 2న అమెరికాలోని న్యూ జెర్సీలో సాయిదత్త పీఠంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అప్పుడు మంత్రి పద్మాదేవేందర్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు. 2022 సెప్టెంబర్‌లో కరీంనగర్‌లో తెలంగాణ వజ్రోత్సవాల్లో ఉత్తమ గాయని అవార్డు తీసుకున్నారు. కరీంనగర్‌లోని వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో ఐదుసార్లు ప్రదర్శన ఇచ్చారు.

'సురభి' ప్రదర్శనలు



వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో హైదరాబాద్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర సురభి థియేటర్ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. శ్రీ కృష్ణ లీలలు, పాతాలబైరవి, భక్త ప్రహ్లాద, మాయాబజార్, శ్రీ వేంకటేశ్వర నాటకాలు కలకాలం గుర్తుండిపోతాయి. 138 ఏళ్ల చరిత్ర ఈ కళాకారులకు ఉంది. ప్రస్తుతం ఆరోతరం వారు సైతం ఇదే రంగంలో రాణిస్తున్నట్లు సురభి డైరెక్టర్ జయచంద్ర వర్మ వివరించారు. కరీంనగర్‌లోని వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడేళ్లుగా వీరు నాటక ప్రదర్శన ఇస్తున్నారు. ప్రస్తుత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 25, 26 రోజున భక్త ప్రహ్లద, పాతాళభైరవి నాటకాలతో ఆకట్టుకున్నారు. ఈ బృందంలో 60 మంది ఉన్నారు.

నాట్య మయూరాలు.. ఈ తల్లీకూతుళ్లు



సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన అనూషా యశస్విని ప్రభుత్వ టీచర్. ప్రస్తుతం ముస్తాబాద్ మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నారు. యశస్వినికి చిన్నతనం నుంచి నృత్యం అంటే ఇష్టం. సిరిసిల్లలోని శ్రీబాలా త్రిపుర సుందరి కూచిపూడి నాట్యాలయంలో గురువు భోగ ధర్మరాజు నేతృత్వంలో యశస్విని కూతురు శ్రీమేధతో కలిసి నృత్యంతో సాధన చేస్తున్నారు. శ్రీమేధ ప్రస్తుతం ఆరోతరగతి చదువుతోంది. వేములవాడలో మహాశివరాత్రికి, కొండగట్టులో హనుమాన్ జయంతి సందర్భంగా, ఇటీవల కరీంనగర్‌లో వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. మొత్తంగా ఇప్పటి వరకు 30కి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. అనూషా యశస్విని చెల్లెలి కూతురు హన్సిణి సైతం కూచిపూడిలో రాణిస్తోంది. హన్సిణి తల్లిదండ్రులు నరేశ్- నిరోషా చిన్నారి ప్రతిభను గుర్తించి కరీంనగర్‌లోని సంస్కృతి టెంపుల్ ఆఫ్ డ్యాన్స్‌లో గురువు సురేంద్రచారి వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. రెండో తరగతి చదువుతున్న హన్సిణి వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన ఇచ్చి టౌన్, ట్రాఫిక్ ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, విజయ్‌కుమార్‌ల నుంచి ప్రశంసలు పొందింది.

ఏళ్ల తరబడి..



కరీంనగర్‌లో ఏళ్ల తరబడి చాలీసా పారాయణం చేస్తున్నాం. పాతబజారులో వేలాది మంది సభ్యులతో నిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పదిమందితో ప్రారంభమై.. ఇప్పుడు ఐదువందలకు పైగా సభ్యులతో కొనసాగుతున్నాం. చాలీసా పారాయణంతో మనసు భక్తిపారవశ్యంతో ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో అవకాశం పూర్వజన్మ సుకృతం.

- భోగ శ్రీనివాస్, హనుమాన్ సేవా సమితి, పాత బజార్, కరీంనగర్

భక్తి భజనలో గట్టుదుద్దెనపల్లి వాసులు



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన శివరామకృష్ణ భజన మండలి సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందుంటున్నారు. ఈ భజన మండలి 40ఏళ్లుగా 19మంది సభ్యులతో కొనసాగుతోంది. ప్రముఖ గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ శంకలింగం ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరు ఇప్పటి వరకు వేములవాడ, యాదాద్రి, కొండగట్టు, భద్రాచలంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి బృందంలో 60 ఏళ్ల వయసు ఉన్న పెద్దల నుంచి 22 ఏళ్ల యువకుల వరకు స్వామివార్ల ఆరాధన చేతున్నారు. కరీంనగర్ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ఈనెల 27న వీరు ప్రదర్శన ఇచ్చారు. ఆంజనేయస్వామి గీతాలు, అయ్యప్ప కీర్తనలు, వెంకన్న పాటలతో ఆకట్టుకుంటున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆర్గనైజ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.. మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మినీ తిరుమలను తలపిస్తోంది. కళావేదికపై వేలాదిమంది కళాకారులు తమ ప్రతిభను చాటుతుండగా.. మేము వారిని సత్కారాలతో అభినందిస్తున్నాం. శోభాయాత్రలో మూడువేల మంది కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి.

- గోగుల ప్రసాద్, బ్రహ్మోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి

భద్రతలో భళా.. బడిలో డీలా!

- సామాజిక భద్రతలో పాత జిల్లా మెరుగు
- బడిలో వెనుకబడిన ఉమ్మడి జిల్లా
- తలసరి ఆదాయం, విద్యుత్తు కనెక్షన్లలో ముందంజ
- నాలుగు జిల్లాల్లో మెరుగుపడాల్సిన రహదారులు
- రాష్ట్ర గణాంక నివేదికలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు వంటి సామాజిక భద్రత విషయంలో ఉమ్మడి జిల్లా భళా అనిపించుకుంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలైన తలసరి ఆదాయం, విద్యుత్ కనెక్షన్లు, రహదారులు తదిరాల విషయంలోనూ రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోల్చినప్పుడు ముందంజలోనే ఉంది. అదే సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల ఏర్పాటు విషయంలో మాత్రం చాలా వెనుకబడి ఉంది. వివిధ విభాగాల్లో 33 జిల్లాలు సాధించిన పురోగతిని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర గణాంకాల నివేదికలో పొందుపరిచింది.

విద్యుత్తు కనెక్షన్లలో కరీంనగర్ టాప్..!

రాష్ట్రంలో విద్యుత్తు కనెక్షన్ల విషయంలో ఉమ్మడి జిల్లా ముందంజలో ఉంది. జిల్లాల విద్యుత్తు వ్యవసాయ, గృహ, పారిశ్రామిక కనెక్షన్లను గమనిస్తే.. హైదరాబాద్ తొలిస్థానంలో ఉండగా.. కరీంనగర్ 10వ స్థానంలో నిలిచింది. పెద్దపల్లి (13వ స్థానం), జగిత్యాల (17వస్థానం)

ర్యాంకు	జిల్లా	మొత్తం కనెక్షన్లు
10	కరీంనగర్	5,39,036
13	పెద్దపల్లి	5,05,611
17	జగిత్యాల	3,53,141

తరువాత స్థానంలో నిలిచా యి. రాష్ట్రవ్యాప్తంగా తలసరి విద్యుత్తు వినియోగం 2020–21లో 2012 కిలోవాట్లుగా ఉండగా.. 2021–22లో 2126 కిలోవాట్లకు చేరడం గమనార్హం.

దారిన పడని రహదారులు..!

ర్యాంకు	జిల్లా	మొత్తం రోడ్లు (కి.మి)
15	జగిత్యాల	2,967
21	కరీంనగర్	2,570
25	పెద్దపల్లి	2,275
28	రాజన్న సిరిసిల్ల	2,082

మౌలిక సదుపాయాల్లో కీలకమైన రహదారుల విషయంలో ఉమ్మడి జిల్లా వెనకబడిందనే గణాంకాలు చెబుతున్నాయి. 33 జిల్లాల్లో ఉన్న జాతీయ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారుల వివరాలను పరిశీలించినప్పుడు ఇదే విషయం స్పష్టమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల రోడ్లను పరిశీలిస్తే.. జగిత్యాల 15వ స్థానంలో మెరుగైన ర్యాంకుతో ఉంది. తరువాత స్థానంలో కరీంనగర్ (21వస్థానం), పెద్దపల్లి (25వస్థానం), రాజన్నసిరిసిల్ల (28వస్థానం)లో నిలిచాయి.

తలసరి ఆదాయం సూపర్

ర్యాంకు	జిల్లా	తలసరి ఆదాయం
12	కరీంనగర్	రూ.1,10,568
13	పెద్దపల్లి	రూ.1,06,184
24	రాజన్నసిరిసిల్ల	రూ.88,932
27	జగిత్యాల	రూ.84,742

రాష్ట్రవ్యాప్తంగా పౌరుల తలసరి ఆదాయం గణాంకాల్లో ఉమ్మడి జిల్లా మంచి ర్యాంకును నమోదు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పౌరుల సరాసరి సగటు తలసరి ఆదాయం రూ.1,43,023గా ఉంది. జిల్లాల విషయానికి వస్తే.. రంగారెడ్డి రూ.4,18,964తో టాప్‌లో నిలిచింది. కరీంనగర్ జిల్లా 12వ ర్యాంకుతో ఉమ్మడి జిల్లాలో అగ్రస్థానం దక్కించుకుంది. అదే సమయంలో పెద్దపల్లి (13వస్థానం)తో రెండోస్థానంలో నిలవగా.. రాజన్నసిరిసిల్ల (24), జగిత్యాల (27)తో కాస్త వెనకబడ్డాయి.

పాఠశాలల్లో దయనీయం..

ర్యాంకు	జిల్లా	మొత్తంస్కూళ్లు	విద్యార్థులు
05	రాజన్నసిరిసిల్ల	655	78,195
08	పెద్దపల్లి	769	98,425
11	కరీంనగర్	1,014	1,46,920
17	జగిత్యాల	1,122	1,46,632

పాఠశాలల విషయంలో ఉమ్మడి జిల్లా చాలా వెనకబడి ఉంది. పాఠశాలల సంఖ్యను విద్యార్థుల సంఖ్యతో సగటు లెక్కించినప్పుడు ఈ విషయం స్పష్టమవుతోంది. తక్కువ స్కూళ్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో రాష్ట్రంలో రాజన్నసిరిసిల్ల జిల్లా 5వ స్థానంలో నిలిచింది. అదే సమయంలో పెద్దపల్లి (8వ స్థానం), కరీంనగర్ (11వ స్థానం), జగిత్యాల (17వ స్థానం)లో నిలిచాయి.

సామాజిక భద్రతలో భేష్

నిరుపేదలు, సమాజంలో పలు కారణాల వల్ల వెనకబడిన పలువురికి ప్రభుత్వం సామాజిక భద్రత కింద బియ్యం, పింఛన్లు అందజేస్తోంది. ఈ విషయంలో ఉమ్మడి జిల్లాలో మెజారిటీ పేదలకు రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేస్తోంది. రేషన్‌కార్డుల విషయంలో జగిత్యాల రాష్ట్రంలో 9వ స్థానంలో ఉమ్మడి జిల్లాలో తొలిస్థానంలో నిలిచింది. కరీంనగర్ (12వ స్థానం), పెద్దపల్లి (20వ స్థానం), సిరిసిల్ల (26వ స్థానం) తరువాత స్థానాల్లో నిలిచాయి. అదే వృద్ధాప్యం, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ రోగులకు ప్రభుత్వపరంగా అందజేసే పింఛన్ల విషయంలోనూ జగిత్యాల రాష్ట్రంలో 3వ స్థానం, ఉమ్మడి జిల్లాలో తొలిస్థానం దక్కించుకుంది. కరీంనగర్ (12వస్థానం), పెద్దపల్లి (20వ స్థానం), సిరిసిల్ల (26వస్థానం) తరువాత స్థానాలు దక్కించుకున్నాయి.

ర్యాంకు	జిల్లా	షాపులసంఖ్య	ఎఫ్ఎస్‌సీకార్డు
09	జగిత్యాల	593	2,95,915
12	కరీంనగర్	487	2,64,490
20	పెద్దపల్లి	413	2,09,954
26	సిరిసిల్ల	344	1,61,524

ఆసరా పింఛన్లు ఇలా..

ర్యాంకు	జిల్లా	మొత్తం పింఛన్లు
03	జగిత్యాల	2,29,459
13	కరీంనగర్	1,41,923
16	సిరిసిల్ల	1,21,295
25	పెద్దపల్లి	98,009

క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎస్పీ భాస్కర్



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాల: ఎస్పీగా శనివారం బాధ్యతలు స్వీకరించిన భాస్కర్.. జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ రవిని కలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై చర్చించారు.

సౌదీలో తెర్లుమద్దివాసి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామానికి చెందిన మామిండ్ల దశరథం(60) శనివారం సౌదీ అరేబియాలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గత ముప్పై ఏళ్లుగా సౌదీ అరేబియా వెళ్లి వస్తున్న దశరథం నెలరోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. సౌదీలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శుక్రవారం రాత్రి తన గదిలో నిద్రించిన దశరథం ఉదయం లేవకపోవడంతో సహచరులు లేపే ప్రయత్నం చేశారు. దశరథం నోటి వెంట రక్తం కారడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు కుటుంబికులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. దశరథం మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

ఇసుకడంపులు స్వాధీనం

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లిలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారులో దాదాపు 10 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా నిల్వచేశారని సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి స్వాధీనం చేసుకొని రెవెన్యూశాఖకు అప్పగించారు. ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు

రేపటి వరకు సస్పెన్స్

- సోమవారం నిర్ణయం వెల్లడించనున్న కలెక్టర్
- తాజాగా మంత్రి కొప్పులను కలిసిన కౌన్సిలర్లు
- 'ఈ చైర్‌పర్సన్ వద్దు.. వేరే ఎవరైనా ఓకే' అంటూ విన్నపం
- అధిష్టానానిదే తుది నిర్ణయమన్న మంత్రి కొప్పుల ఈశ్వర్
- భోగ శ్రావణి రాజీనామా నేపథ్యంలో తాజా పరిణామాలు ఇవీ..



మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

జగిత్యాల: జగిత్యాల అధికార బీఆర్‌ఎస్‌లో హాట్ టాపిక్‌గా మారిన మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి రాజీనామా, 27మంది కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం లేఖ వ్యవహారంపై కలెక్టర్ రవి, పార్టీ అధిష్టానం సోమవారం వరకు తుది నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది. మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ రవి ఈ విషయాలను స్వయంగా ధ్రువీకరించారు. మరోవైపు.. 'ఆ చైర్‌పర్సన్ వద్దు.. ఆ పదవి ఎవరికి ఇచ్చినా అంగీకరిస్తాం.. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదు..' అంటూ కౌన్సిలర్లు శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను జిల్లా కేంద్రంలో కలిసి తమ నిర్ణయాన్ని కుండబద్దలు కొట్టారు. శుక్రవారం ఎమ్మెల్సీ రమణతో భేటీ అయిన అసంతృప్తివాదులు.. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి ఎమ్మెల్యే సంజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిపై తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించిన విషయం విదితమే.

వివరాలు సేకరించిన మంత్రి..

భోగ శ్రావణి ఎమ్మెల్యేపై కోపంతో తన పదవికి రాజీనామా చేశారా, పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నారా? అనే కోణంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం పలువురిని కలిసి వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే సంజయ్ చేతికి చైర్‌పర్సన్‌పై 27 మంది కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం లేఖ అందించడం.. 25న శ్రావణి తన పదవికి రాజీనామా చేయడం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేపట్టామని మంత్రి సైతం తనను కలిసిన కౌన్సిలర్లతో అన్నట్లు సమాచారం. అధిష్టానానిదే తుది నిర్ణయమని వారితో చెప్పడం కొసమెరుపు. మరోవైపు.. బీఆర్‌ఎస్ అధిష్టానం నుంచి తనకు ఎలాంటి సమాచారం లేదని శ్రావణి చెబుతున్నారు. చైర్‌పర్సన్ పదవిలో కొనసాగాలని అధిష్టానం ఆదేశిస్తే అంగీకరిస్తారా? అని ప్రశ్నించగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశానని, భవిష్యత్ నిర్ణయం తర్వాత చెబుతానని ఆమె స్పష్టం చేశారు.

అధిష్టానానికి టచ్‌లోనే నలుగురు..

జిల్లాకు చెందిన మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పార్టీ అధిష్టానం నిత్యం టచ్‌లోనే ఉంటోంది. తాజా పరిణామాలు, భవిష్యత్ నిర్ణయాలపై చర్చించేందుకు మంత్రి కేటీఆర్ ఈ నలుగురిని హైదరాబాద్‌కు ఆహ్వానించినట్లు కూడా తెలుస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం రాజీనామా, అవిశ్వాస తీర్మానం తదితర అంశాలపై ఓ క్లారిటీ రానుంది.

పోరుబాటలో బీసీ సంఘాలు..

పద్మశాలీ సామాజికవర్గానికి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి తన పదవికి రాజీనామా చేసేందుకు దారితీసిన పరిస్థితులను సీరియస్‌గా తీసుకున్న బీసీ సంఘాల నాయకులు ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు. శ్రావణికి మద్దతుగా నిలుస్తున్నారు.

ఎమ్మెల్యే తీరు సరికాదు



భోగ శ్రావణితో బీసీ సమాజ్ నాయకులు

జగిత్యాల: మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిపై ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు సరికాదని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సూర్యారావు, చొప్పరి శంకర్‌రావు అన్నారు. శనివారం ఆమెను కలిసి సానుభూతి తెలిపారు. ఒక బీసీ బిడ్డను వేధించడం సరికాదన్నారు. రాజకీయంగా అణచివేసేందుకు యత్నించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగ ప్రమీల పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

కుటుంబ పాలనతోనే బల్దియా సమస్యల్లో చిక్కుకుందని, మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిని మార్చాలని అన్నామని, అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని తాము కోరలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ కుటుంబ పాలన కొనసాగినా భరించామన్నారు. పార్టీ మారేందుకే నిర్ణయించుకున్న శ్రావణి.. ఎమ్మెల్యే సంజయ్‌పై లేనిపోని ఆరోపణలు చేశారని, ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడే విషయాన్ని ఎంపీ అర్వింద్ తన ఫేస్‌బుక్‌లో ఎలా లైవ్ ప్రసారం చేశారని ప్రశ్నించారు. యువత కొత్త ఆలోచనలతో మున్సిపల్ అభివృద్ధి చెందుతుందని భావించిన ఎమ్మెల్యే సంజయ్.. శ్రావణికి చైర్‌పర్సన్ పదవి ఇస్తే సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. ఆమె హయాంలో ఏసీబీ దాడులు, విచారణలు జరిగాయని దుయ్యబట్టారు. కమిషనర్లను మార్చడం, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. బీజేపీ కనుసన్నల్లోనే శ్రావణి నడిచారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతుల పక్షాన బీజేపీ పోరాటం



మాట్లాడుతున్న మదన్‌మోహన్

రాయికల్(జగిత్యాల): రాయికల్ మార్కెట్‌యార్డులో సమీకృత మార్కెట్ నిర్మిస్తే రైతుపక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా అసెంబ్లీ కన్వీనర్ మదన్‌మోహన్ హెచ్చరించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌యార్డు రైతులకు సంబంధించినది అని, ఇందులో సమీకృత మార్కెట్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. అవసరమైతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. మార్కెట్‌యార్డులో వసతులు కల్పించాలేగానీ పట్టణ ప్రజలకు 2 కి.మీ దూరంలో ఉన్న ఈ యార్డులో సమీకృత మార్కెట్ నిర్మిస్తే ఎలాంటి ఆందోళనకైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, నాయకులు సందీప్, చిలువేరి ప్రవీణ్, తిరుపతినాయక్, కట్కం కిశోర్, సింగని సతీశ్, సతీశ్, గోపి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు : మంత్రి



మొక్క నాటుతున్న మంత్రి ఈశ్వర్

గొల్లపల్లి(ధర్మపురి): ఆయిల్‌పామ్‌తో రైతులు 30ఏళ్ల పాటు తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అబ్బాపూర్‌లో శనివారం ఆయిల్ పామ్ మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు లాభసాటి వ్యవసాయం కోసం ఆధునిక పద్ధతులు పాటించాలని సూచించారు. కొత్త పంటలు పండించాలని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రాయితీలు అందిస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ రవి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి రమణరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

నేటినుంచి రోళ్లవాగు ఆయకట్టుకు సాగునీరు



నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టు కొత్త కట్ట

సారంగాపూర్(జగిత్యాల): ఎట్టకేలకు రోళ్లవాగు ప్రాజెక్టు ఆయకట్టుకు ఆదివారం సాగునీరు విడుదల చేస్తారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉదయం 11గంటలక నీటిని విడుదల చేయనున్నారు. మొన్నటి వర్షాకాలంలో వరదలతో ప్రాజెక్టు పాత కట్ట తెగి, దాని కింద కొత్తగా చేపట్టిన కట్ట తెగింది. పొలాల్లో ఇసుక మేటలు వేయడం, విద్యుత్ మోటార్లు, స్తంభాలు, పైప్‌లైన్లు వరదలో కొట్టుకుపోవడంతో రైతుల వానాకాలం పంట సాగు చేయలేకపోయారు. ఆర్థికంగానూ భారీగా నష్టపోయారు. యాసంగికైనా సాగునీరు అందించాలని రైతులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతులతో కలిసి ఆందోళనలు చేశారు. ప్రాజెక్టు అధికారులపై ఒత్తిడి రావడంతో 85 శాతం వరకు పనులు పూర్తిచేశారు. మూడోకట్ట 840 మీటర్ల పొడవు, 14 మీటర్ల వరకు ఎత్తు నిర్మాణం పూర్తిచేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డి–53, 12 ఎల్ కాలువల ద్వారా 250 క్యూసెక్కులను రోళ్లవాగు ప్రాజెక్టులోకి వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు మూడో తూము నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. దీనిద్వారా బీర్‌పూర్ మండలం బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్, కొల్వాయి, ధర్మపురి మండలం దొంతాపూర్, దోనూర్, నక్కలపేట, ధమ్మనపేట, రాజారం, కొల్వాయి, జైనా, తుమ్మెనాల గ్రామాల్లోని సుమారు 9 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్ శనివారం తెలిపారు.

ఆదివాసీలను ఆదుకోవాలి : కుర్సెంగ వేణు



మాట్లాడుతున్న కుర్సెంగ వేణు

రాయికల్(జగిత్యాల): ఆదివాసీ గిరిజనలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివాసీ దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుర్సెంగ వేణు కోరారు. శనివారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీ తెగలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయన్నారు. ముఖ్యంగా నాయికపోడు కులానికి ప్రత్యేక జీవో లేక అన్నివిధాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నాయికపోడుకు ప్రత్యేక జీవోతోపాటు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ఆత్రం రవీందర్, కుర్సెంగ ప్రసన్నకుమార్, కుర్రబుచ్చన్న, సురేందర్, సుమన్, సుశీల్, రాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎంసీ డైరెక్టర్‌కు గాయాలు

వేములవాడ: వేములవాడ మార్కెట్ కమిటీ సభ్యుడు కమలాకర్‌రెడ్డి శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, శనివారం కమలాకర్‌రెడ్డిని పరామర్శించారు.

గల్ఫ్ కార్మికులకు నిధులు కేటాయించండి

జగిత్యాలరూరల్: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

మెడికల్ సర్టిఫికెట్లు అందించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయుల బదిలీల్లో పాల్గొన్న వారికి జీవో ఎంఎస్ నంబరు 5 ప్రకారం మెడికల్ సర్టిఫికెట్లు జారీచేయాలని పీఆర్టీయూ డిమాండ్ చేసింది. క్యాన్సర్, ఓపెన్ హార్ట్‌సర్జరీ, న్యూరోసర్జరీ, బోన్ టీబీ, కిడ్నీ, లివర్, హార్ట్ వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారికి మెడికల్ సర్టిఫికెట్ అందజేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, మెడికల్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వైద్యులు నిరాకరిస్తున్నారని, దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఇచ్చేలా చూడాలని ఉపాధ్యాయులు కోరారు.

శ్రీనివాస్‌గౌడ్‌కు సత్కారం



సత్కరిస్తున్న అతిథులు

జగిత్యాల: పట్టణానికి చెందిన గీత కార్మికుడు నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ రచించిన దులుదుమ్ము నవలకు పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం వారు పురస్కారాన్ని అందజేశారు. శనివారం కళాశ్రీ సాహితి వేదిక సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన మానేరు వెలస్కో 23 ప్రదర్శనలు

- ప్రారంభించిన ఐఎంఏ అధ్యక్షుడు రామ్‌కిరణ్



కరోనా ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో శనివారం మానేరు వెలస్కో–23 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు తమ మేథస్సుకు పదునుపెట్టి చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. మానేర్ వెలస్కో–23 కార్యక్రమాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులుపి.రాంకిరణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. మానేరు విద్యార్థులు తమ మేథస్సుకు పదనుపెట్టి సమాజానికి ఉపయోగపడే విధంగా వినూత్న తరహాలో ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. మానేరు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం క్లాస్‌రూంకే పరిమితం కాకుండా తమ లోదాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అతిథులు విద్యార్థుల ప్రదర్శనల స్టాళ్లను తిలకించారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, ప్రముఖ వైద్యులు సీహెచ్.రమణాచారి, ఎల్.అమృత్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు సునీతారెడ్డి, శ్వేతారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

ఇందల్వాయి: నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామానికి చెందిన అందె నగేష్(35) మృతి చెందాడు. ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. నగేష్ బావమరిది నవీన్ దుబాయ్ వెళ్లాల్సి ఉండగా నవీన్‌తోపాటు జగ్గసాగర్‌కు చెందిన అతడి స్నేహితుడు వెంకటేశ్‌గౌడ్‌ని వెంటపెట్టుకొని నగేష్ శుక్రవారం ఎయిర్‌పోర్టుకు కారులో బయలు దేరాడు. నవీన్‌ను ఎయిర్‌పోర్టులో దింపి, తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు టోల్‌ప్లాజా దాటగానే నిలిపి ఉంచిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో నగేష్ తలకు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కారు నడుపుతున్న వెంకటేష్‌గౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు, సముదాయిస్తున్న పోలీసులు

జగిత్యాల: ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద కార్యకర్తలతో కలిసి శనివారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. కేంద్రప్రభుత్వం 10శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30శాతం నిధులను ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించాలన్నారు. కేజీ టు పీజీ అమలు చేయాలని, గురుకుల సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్రమ్, సంజయ్, పవన్, రాహుల్, రాజేశ్, సుకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీచర్లు

మెట్‌పల్లి(కోరుట్ల): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి డిమాండ్ చేశారు. వచ్చేనెల 6న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలో శనివారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బందికి బకాయిపడ్డ టీఏ, డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. ఖాళీ పోస్టులను టీచర్ల ద్వారా భర్తీ చేయాలన్నారు. టీచర్లకు 4జీబీ డేటాతో కూడిన 5జీ స్మార్ట్ ఫోన్లను ఉచితంగా అందజేయాలని కోరారు. డిమాండ్ల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో ఆందోళన చేపట్టామని, పెద్దసంఖ్యలో సిబ్బంది తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు రైతుల వినతి



అదనపు కలెక్టర్ మకరంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయవద్దని కోరుతూ రైతు సంఘం నాయకులు శనివారం అదనపు కలెక్టర్ మకరంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు కోసం 5 ఎకరాలు కొనుగోలు చేశామని, ఇది సరిపోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో పట్టణానికి దూరంలోని మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేస్తే ఏ ఒక్కరికి కూడా ఉపయోగం ఉండదన్నారు. పట్టణంలో సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, గంగారెడ్డి, మండ రమేశ్, మ్యాకల రమేశ్, బాపురపు నర్సయ్య, గోపి రాజిరెడ్డి, దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఉచిత శిక్షణ

జగిత్యాలరూరల్: ఉన్నతి కార్యక్రమం కింద జాతీయ ఉపాధిహామీలో వందరోజులు పూర్తి చేసుకున్న కూలీలకు ఉచిత శిక్షణ అందిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం నూకపల్లి న్యాక్ కేంద్రంలో ఉపాధిహామీ కూలీలకు వివిధ పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో సేంద్రియ పద్ధతులు, పంటల సాగు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని తెలిపాడు. ఇందులో భోజన వసతి, భత్యం ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యకరమంలో ఈజీఎస్ ఏపీడీ నరేశ్, సెర్ప్ ఏపీడీ సుధీర్, శాస్త్రవేత్తలు భాస్కర్, నవ్య, జేడీఎం వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.